

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## తెల్లటి అబద్ధం

**ఇంట్లో** ఏదో తేడాగా ఉందని రాంగోపాల్‌కి రెండురోజులుగా అనిపిస్తోంది. భార్య చెప్తుందేమోనని ఎదురుచూసాడు కానీ దేవిక బయటపడలేదు. కాని ఉన్నట్లుండి కన్నీరు పెట్టుకోవడం, భర్త చూడకుండా కళ్ళు తుడుచుకోవడం గమనిస్తూనే ఉన్నాడు. ఎప్పుడూ ఇంట్లో కూడా బయటకి వెళ్తుందా అన్నట్లుగా అందంగా తయారై వుండే దేవిక శరీరం మీద అసలు శ్రద్ధ చూపించడంలేదు. వేలు ముడితోనే తిరుగుతోంది.

"అభీ కాలేజ్‌కి వెళ్తున్నట్లు లేడు? ఏదైనా సమస్యా?" ఆ రాత్రి భోజనాల దగ్గర అడిగాడు.

వడ్డిస్తున్న దేవిక ఉలిక్కిపడింది. ఆ ఉలికిపాటు కనపడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

సమస్య అభయ్‌తోనే ముడిపడివుందని రాంగోపాల్‌కి అర్ధమైంది. ఏం చేసాడు? ఒక్కడే కొడుకైనా అతిగారాబం ఎప్పుడూ చెయ్యలేదు. బుద్ధిగా చదువుకుంటున్నాడు. ఇంజనీరింగ్‌లో చేరాడు. ఇంక సమస్యేమిటి?

రాంగోపాల్ పెదవుల మీద చిరునవ్వు తొణికిసలాడింది. ఎవరినైనా ప్రేమించాడేమో? ఐనా సెకండ్ ఇయర్‌లోనే ప్రేమా? దీనికోసం దేవిక అంత దిగులు పెట్టుకోడం ఎందుకో అనుకున్నాడు.

ఆ రాత్రి దేవిక భర్తతో భయంగా చెప్పింది.

"మీకోటి చెప్తాను. ఆవేశపడొద్దు."

"అంత సీరియస్ విషయమా? సరే చెప్పు. ఎన్ని బేక్‌లాగ్స్" చిరుకోపంగా అడిగాడు.

"అదికాదు, అభి కాలేజ్‌కి వెళ్ళడట."

"వెళ్ళడా? అదేం?" రాంగోపాల్ ఆశ్చర్యపోయాడు.

"చదువు మానేస్తాడట."

"మానేసి?" రాంగోపాల్‌లో ఆవేశం పెరిగిపోతోంది.

"సినిమా డైరెక్టర్ అవుతాట్ట." దేవిక గబగబా చెప్పింది.

"ఏమిటి?" నిర్ఘాంతపోయి అడిగాడు.

"వాడికి డైరెక్టర్ అవాలని కోరికట. ఇంజనీరింగ్ చదివినా ఉద్యోగం చేయడట. రెండేళ్ళు వేస్ట్ చేసాను. ఇంక రెండేళ్ళు వేస్ట్ చేయలేను అన్నాడు. ఎంత నచ్చచెప్పినా వినడంలేదు" దేవిక భయంగా చెప్పింది.

"అభీ"

రాంగోపాల్ అరుపుకి పక్క గదిలోని అభయ్ పరిగెత్తుకు వచ్చాడు.

"ఏరా డైరెక్టర్ అవుతావా?" అదే స్వరంతో అడిగాడు.

"అవును."

"నీకీ పిచ్చి ఎప్పుడు పట్టింది?"

"పిచ్చికాదు. అదే నా గోల్." అభయ్ నిర్భయంగా చెప్పాడు.

"నా దగ్గర నీ సినిమా డైలాగ్స్ చెప్పద్దు" రాంగోపాల్ గర్జించాడు.

"మెల్లిగా మాట్లాడండి" దేవిక భయపడుతూ చెప్పింది.

"నీకు అర్థమౌతోందా? చదువు మానేయడం అంటే ఏమిటి? వీడి క్వాలిఫికేషన్ అప్పుడు ఇంటర్మీడియట్టే. సర్టిఫికెట్స్ కావలన్నా మిగతా రెండేళ్ళ ఫీజ్ కడితే కానీ ఇవ్వరు. ఇంటర్ క్వాలిఫికేషన్ వాడికి ఎవరైనా పిల్లనిస్తారా? నాలాంటి తలకిమాసినవాడు ఇచ్చినా పెళ్ళాం పిల్లల్ని ఏం పెట్టి పోషిస్తాడు? ఎవరైనా వింటే నవ్వుతారు. నీ బుద్దేమైందని తిడతారు కూడా" రాంగోపాల్ ఆయాసంగా ఆగాడు.

"నాకిప్పుడు పెళ్ళి, పిల్లలు ఆలోచనలేం లేవు నాన్నా. నా లక్ష్యం డైరెక్టర్ అవడమే" అభయ్ తలవంచుకుని చెప్పాడు.

"నువ్వు క్లిక్ కాలేదు. పెళ్ళి ఆలోచన వచ్చింది. అప్పుడేం చేస్తావు? నేను బతికినన్నాళ్ళూ నీ ఫేమిలీని పోషించాలా? వెధవ ఆలోచనలు కట్టిపెట్టి రేపటినుంచీ కాలేజ్‌కి వెళ్ళు"

"వెళ్ళను. ఇంకో రెండేళ్ళు టైం వృధా చేసుకోదల్చుకోలేదు. రేపే ఫిల్మ్‌నగర్ వెళ్ళి ఎవరి దగ్గరైనా అసిస్టెంట్‌గా చేరతా" అభయ్ మొండిగా చెప్పాడు.

"మనకి సినిమాహాల్లో టిక్కెట్లు చింపేవాడితో సహా ఇండస్ట్రీలో ఎవరూ తెలీదు. మనవల్ల కాదురా బుద్ధిగ చదువుకుని స్థిరమైన ఉద్యోగం చూసుకుంటే నిశ్చింతరా అభీ" ఆయన నిస్సహాయంగా చెప్పాడు.

"సారీ నాన్న" అభి ఆ గదిలోంచి బయటకి వెళ్ళిపోయాడు.

మర్నాడు రాజగోపాల్ నిద్రలేచేలోగానే అభయ్ ఇంట్లోంచి బయటకి వెళ్ళిపోయాడు. ఆయన భార్యవైపు ప్రశ్నార్థకంగా చూసాడు. దేవిక తల అడ్డంగా తిప్పింది.

"వెధవకి ఒక్క పైసా ఇవ్వకు. టైమ్‌కి ఇంట్లో వుంటే తిండిపెట్టు. అంతే" హుంకరించాడు.

అభయ్ ఆ మధ్యాహ్నం రాలేదు. సాయంత్రం ఏడున్నర అవుతూండగా అలసటగా వచ్చాడు. దేవిక తల్లి మనసు కరిగిపోయింది. కానీ భర్తకి భయపడి ఏమీ మాట్లాడలేదు. స్నానం చేసి అన్నం తిని అభయ్ ఆ రాత్రి చాలాసేపు మెలుకువుగా ఉండి ఏదో రాసుకోవడం ఇద్దరూ గమనించారు కానీ మౌనంగా ఉండిపోయారు.

అభయ్ ఐదున్నరకే లేచి జాగింగ్ చేసివచ్చి బ్లాక్ కాఫీ కలుపుకుని గదిలోకి వచ్చాడు. టేబుల్ మీద అతని రైటింగ్ పేడ్ మీద పది ఐదువందలనోట్లు కనిపించాయి. 'థాంక్స్ అమ్మా' అనుకున్నాడు. అతని కళ్ళు చెమర్చాయి.

తండ్రి లేచేలోగానే బ్రేక్‌ఫాస్ట్ తిని బయలుదేరాడు.

"లంచ్ బాక్స్ ఇవ్వనా?" దేవిక నెమ్మదిగా అడిగింది.

"వద్దమ్మా. అక్కడ ఏదో తినేస్తాలే.... అమ్మా... థాంక్స్" చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ ఇంటి నిండా నిశ్శబ్దం అలముకుంది. అవసరమైనా మనుషులు సైగలు చేసుకుంటున్నారు తప్ప మాట్లాడుకోవడంలేదు. దేవిక చిక్కి సగమైంది. రాంగోపాల్ అవమానంతో రగిలిపోతున్నాడు. ఆఫీస్‌లో అందరికీ అభయ్ గురించి తెలిసిపోయింది. ఎదురుగా వెటకారాలు, వెనకాల జోక్స్.

మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన రాంగోపాల్ పెద్ద చదువు చదువుకుని, మంచి ఉద్యోగంలో సెటిలైతే చాలు ఇంక జీవితం కుదుటపడినట్లే అనే భావాలతో పెరిగాడు. చిన్నప్పటినించీ అభయ్‌కీ అవే నూరిపోసాడు. అలాంటిది వాడు చదువుమానేసి, సినిమావాళ్ళతో తిరగడం ఆయన జీర్ణించుకోలేకపోతున్నాడు. అభయ్‌కి ఎదురుపడడం మానేసాడు. భార్య తప్పులేదని తెలిసినా అకారణ కోపం చూపిస్తున్నాడు. కష్టం చెప్పుకోడానికి ఆత్మీయులే లేకుండా పోయారు. విమర్శించేవాళ్ళు తప్ప.

మగవాళ్ళకంటే ఆడవాళ్ళలో శాడిజం ఓ పదిశాతం ఎక్కువే ఉంటుంది. దేవిక ఫ్రెండ్స్, కజిన్స్, దూరపుబంధువులు ఫోన్ చేసి పరామర్శించి, సినీరంగంలో చేరిపాడైపోయిన వాళ్ళు, తాగుబోతులు, తిరుగుబోతులు, ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ళ గురించి చెప్పి చివరికి అభయ్ భవిష్యత్తు గురించి నిట్టూర్చి దేవికని భయపెట్టడంతో ఆమె హడలిపోయి ఫోన్ జోలికి వెళ్ళడం మానేసింది. రెండు మూడు ఫంక్షన్స్‌లో ఇలాంటి విమర్శలనే ఎదుర్కోవడంతో బయటకి వెళ్ళడమే మానేసింది.

ఓ రోజు రాంగోపాల్ భార్య చేతిలో పదివేలు పెట్టి చెప్పాడు.

"వాడికేం ఖర్చులుంటాయో! అడగడానికి మొహం చెల్లదు"

తల్లి తన చేతిలో పెట్టిన ఆ డబ్బుని చూసి అభయ్ కళ్ళు చెమర్చాయి.

"అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరడానికి ట్రై చేస్తున్నానమ్మా. ఎవరో ఒకరు అనుకోవడం లేదు. నాకు ఇష్టమైన వాళ్ళ దగ్గర పనిచేయాలని..."

"మనకి తెలీని రంగం ఎందుకురా అభీ. ఒక సెమిస్టర్ పోతే పోయింది. మళ్ళీ కాలేజ్‌లో చేరరా. కనీసం డిగ్రీ పూర్తి చేసి అటువెళ్తే, అవకాశాలు రాకపోయినా ఏదో ఒక జాబ్ చూసుకోవచ్చు. నా మాట వినరా" దేవిక బతిమాలింది.

"సారీ అమ్మా" అభయ్ వెళ్ళిపోయాడు.

"ఈ రోజు సుమక్క పెళ్ళి నాన్నా" దేవిక చెప్పింది.

"అవునా? మరి నువ్వు వెళ్ళలేదేంటి?" అభయ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"మీ అమ్మకి బయటకి వెళ్ళడానికే మొహం చెల్లడంలేదు. ఇక పెళ్ళిళ్ళకేం వెళ్తుంది?" బెడ్రూంలోంచి రాంగోపాల్ అరిచాడు.

"ఏమ్మా నిజమా? నా గురించి వెళ్ళలేదా?" అభయ్ అపనమ్మకంగా అడిగాడు.

"దాని మొహం చూస్తే అర్థం కావడంలేదా? మీ పెద్దమ్మ పెళ్ళికి పిలవడానికి వచ్చి నీ గురించి ఎంత వెటకారంగా మాట్లాడిందో తెలుసా?"

"ఎందుకు నాన్నా? నా మీద అందరికీ అంత అధికారం? నా గురించి ఎందుకు మాట్లాడతారు? వాళ్ళ జీవితాల్లోకి నేనెప్పుడైనా తొంగి చూసానా? ఏమైనా అన్నానా? ఒక్క రూపాయి అప్పు తీసుకున్నానా? ఒక్కరోజు ఎవరింట్లోనైనా పడుకున్నానా? ఎందుకు అంతా నన్ను హేళన చేస్తున్నారు? సుమక్క ఎంతమంది కుర్రాళ్ళతో ఎన్ని థియేటర్స్‌లో నాకు కనిపించిందో నేనెళ్ళి పెద్దమ్మకి చెప్పానా?" అభయ్ ఆవేదనగా చెప్పాడు.

తర్వాత తల్లివైపు చూస్తూ అరిచాడు. "నీకెందుకు మొహం చెల్లడం లేదమ్మా? నేనేమైనా హత్య చేసానా? దొంగతనం చేసానా? ఇంజనీరింగ్ చదివినవాడే మనిషా? మిగిలిన వాళ్ళు మనుషులు కారా? వాళ్ళ పేరెంట్స్‌కి అవమానమా?"

రెండేళ్ళ తర్వాత.

"వీడి ఫ్రెండ్స్‌లో సగం మందికి కేంపస్ రిక్రూట్‌మెంట్స్ వచ్చాయి. సగం మంది హయ్యర్ స్టడీస్‌కి విదేశాలకి వెళ్తున్నారు. మా ఆఫీస్‌లో వారం నించి ఇదే సందడి. 'మా వాడికి ఐ 20 వచ్చింది' 'మా అమ్మాయికి ఫుల్ ఫీ వైవర్ వచ్చింది' అని కొలీగ్స్ ఒకటే కబుర్లు. నన్ను దాదాపు వెలేసారు. ఏదీ నాకు చెప్పరు. చులకనైపోయాను. రెండేళ్ళు గడిచినా వాడింకా స్టూడియోల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు వీడిలాంటివాళ్ళు అక్కడ వందలమంది" రాంగోపాల్ బాధగా చెప్పాడు.

"వాడితో ఏం అనకండి. అసలే డిప్రెస్‌డ్‌గా ఉన్నాడు పాపం" దేవిక చెప్పింది.

"అనుకుని వాడు కూడా చదువు పూర్తిచేసి ఓ ఉద్యోగం చూసుకుంటే రెండు జీతాలతో మన క్వాలిటీ ఆఫ్ లివింగ్ బాగుండేది" రాంగోపాల్ నిట్టూర్చాడు.

నాలుగేళ్ళ తర్వాత.

పాతికేళ్ళ అభయ్ మైక్‌లో మాట్లాడుతున్నాడు. అతని మొహంలో ఆనందం, ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతున్నాయి. చుట్టూ జర్నలిస్ట్‌లు. పక్కన కుర్చీల్లో ప్రముఖులు.

"ఈ రోజుకోసమే నాలుగేళ్ళుగా తపస్సు చేసాను. ఈ తపస్సులో నా వెంట వుండి, ప్రోత్సహించి, మధ్యలో చదువు మానేసినా కోప్పడకుండా నాకు సపోర్ట్‌గా నిలబడ్డ నా తల్లితండ్రులకి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఐదారుగురు ప్రొడ్యూసర్లు కాంటాక్ట్‌లో ఉన్నారు. నా నెక్స్ట్ సినిమా గురించి త్వరలోనే చెప్తాను."

అభయ్ మాట్లాడడం ఆపినప్పుడల్లా యువకులు చప్పట్లు కొడుతున్నారు.

రాంగోపాల్ దేవిక ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు.

నిజంగా తాము అభయ్‌కి సపోర్ట్‌గా నిలిచారా? వాడి కలని సాకారం చేసుకోమని ప్రోత్సహించారా? ఎంతసేపూ సొసైటీలో తమకి జరిగే అవమానాలు గురించి చెప్పుకోడం తప్ప వాడిని కూర్చోపెట్టి 'నీ బాధలేంటి నాన్నా!' అని అడిగారా? వాడికేం కావాలో కనుక్కున్నారా? అసలు ఆ రోజునించి ఈ రోజుదాకా వాడితో మాములుగా మాట్లాడారా? అసలు వాడు సక్సెస్ అవుతాడని ఒక్క క్షణమైనా నమ్మారా? వాడి ఈ విజయంలో నిజంగా తమ పాత్ర ఉందా?

ఇద్దరూ అసంకల్పింతంగా తల దించుకున్నారు.

Click here to share your comments

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*